సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



పార్కులకు కొత్త సొబగులు

ఏలూరులోని పార్కులు సుందరంగా ముస్తాబవుతున్నాయి. నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేలా నగరపాలక సంస్థల అధికారులు వీటిని సిద్ధం చేస్తున్నారు. IIలో ▸



కృత్రిమ మేధదే ప్రధాన పాత్ర

కృత్రిమ మేధ అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో వర్క్‌షాప్ నిర్వహించారు. IIలో ▸



నేటినుంచి ఫిట్‌నెస్ పరీక్షలు

ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా రెండో దశ దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. IIలో ▸

న్యూస్‌రీల్

భారత్ వైపే ప్రపంచం చూపు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: చంద్రయాన్–3 విజయవంతం కావడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మరెవ్వరికీ సాధ్యం కాని అద్భుతాన్ని సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు దేశ ప్రజలంతా సెల్యూట్ చేయాలన్నారు. ప్రపంచపటంలో భారతదేశం ఒక ముఖచిత్రంలా మారిందని స్పష్టం చేశారు. రష్యా వంటి అభివృద్ధి చెందిన దేశం వల్లే కాని ఇటువంటి విజయాన్ని అతి తక్కువ ఖర్చుతో సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలు అభినందనీయులని కొనియాడారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తుగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారులు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు కారణాలు, నివారణ చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. కాళీపట్నం, ముత్యాలపల్లి గ్రామాలకు ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నేషనల్ హైవే అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీరవాసరం, లంకలకోడేరు, భీమవరం బైపాస్, ఉండి, ఉండి నుంచి గణపవరం మార్గంలో స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవని రవాణా శాఖ పరిశీలనలో గుర్తించినట్లు ఆర్టీసీ ప్రతినిధి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా విషయాలపై చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఏడాది మే నుంచి ఈనెల 15 వరకు 849 వివిధ కేసులను నమోదు చేసి రూ.33.96 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. అనంతరం రోడ్డు భద్రత సూచనలపై వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీటీఆర్ ఎస్సై శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సైలు, ఎంవీఐలు పాల్గొన్నారు.

4న మాధవాయిపాలెం రేవు వేలం పాట

నరసాపురం రూరల్: నరసాపురంలోని మాధవాయిపాలెం రేవులో ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న గుత్తేదారుని హక్కులను రద్దు చేసినట్లు ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్ యాదవ్ తెలిపారు. వచ్చేనెల 4న రేవులో టోల్ వసూళ్లకు వేలం పాట నిర్వహించనున్నామని, దీనికి సంబంధించి గురువారం నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గానూ మిగిలిన కాలానికి 05–09–2023 నుంచి 31–3–2024 వరకు రేవు పాట వర్తిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయ పనిదినాల్లో రూ.2 వేలు చెల్లించి టెండరు షెడ్యూల్ దరఖాస్తును పొందవచ్చని, ప్రభుత్వ ప్రారంభ పాట ధర రూ.2,38,81,715లుగా నిర్ణయిస్తున్నామని చెప్పారు. టెండర్ షెడ్యూల్ కొనుగోలు చేసేందుకు ఈనెల 30న సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, ధ్రువీకరణ పత్రాలను వచ్చేనెల 4న ఉదయం 11 గంటలలోపు అందించాలన్నారు. సీల్డ్ టెండర్లతో కూడిన బహిరంగ వేలం పాటను అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని వివరించారు.

ఎఫ్‌పీఓలతో రైతుల ఆదాయం రెట్టింపు

ఏలూరు(మెట్రో): జిల్లాలో రైతుల ఆదాయం పెంపొందించే దిశగా విస్తృతంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌పీఓ)ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తి, మార్కెటింగ్‌లో స్కేల్ ఆఫ్ స్కేల్‌ను ఉపయోగించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యాన్ని సాధించడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు కీలకమన్నారు. ఆదాయ–ఆధారిత వ్యవసాయానికి ఎఫ్‌పీఓలు భరోసానిస్తాయన్నారు.

వైద్య కళాశాల సిద్ధం

హేలాపురి.. వైద్య సిరి

- ఏలూరులో తుది దశలో నిర్మాణాలు
- రూ.525 కోట్లతో కళాశాల, ఆస్పత్రి, హాస్టళ్లు, క్వార్టర్స్ భవనాలు
- అత్యాధునిక వసతులతో ఏర్పాట్లు
- తొలిదశలో 150 మంది విద్యార్థులకు ప్రవేశాలు
- వచ్చేనెల 1 నుంచి తరగతులు ప్రారంభం



ఏలూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం

ఏలూరు టౌన్: ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాలకు తుది రూపం ఏర్పడింది. అత్యాధునిక సౌకర్యాలు, ల్యాబ్‌లు, సెంట్రల్ ఏసీ, కార్పొరేట్ హంగులతో భవనాలు వైద్య విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ఏలూరు నగరానికి తలమానికంగా మూడు అంతస్తుల మెడికల్ కాలేజీ భవనం తళుక్కుమంటోంది. ఇక్కడ వారం రోజుల్లో ఎంబీబీఎస్ మొదటి ఏడాది విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఏళ్ల నాటి హేలాపురివాసుల కల నెరవేరనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తుండగా.. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ప్రత్యేక శ్రద్ధతో కళాశాల పనులు చేయించారు. ఏకంగా రూ.525 కోట్ల వ్యయంతో వైద్యకళాశాల, సర్వజన ఆస్పత్రి, విద్యార్థులకు హాస్టళ్లు, ప్రొఫెసర్లు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రూ.60 కోట్లతో వైద్య కళాశాల

ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం చేపట్టారు. లక్ష చదరపు అడుగుల్లో జీ ప్లస్ టూ భవనాన్ని నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో రూ.60 కోట్ల నిధులతో భవన నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్‌ఐడీసీ) పర్యవేక్షణలో మెగా ఇంజనీరింగ్ కంపెనీ యుద్ధప్రాతిపదికన కళాశాల భవన నిర్మాణాన్ని చేపట్టింది. పనులు చేపట్టిన రెండేళ్లలో విద్యార్థులకు మొదటి ఏడాది తరగతులు నిర్వహించేలా భవనాన్ని సిద్ధం చేసింది.

వైద్యం ఉన్నతం.. వసతులు అత్యాధునికం

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంఎన్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. కళాశాల భవనాన్ని సుందరంగా రూపుదిద్దుతూ ఆహ్లాదకరంగా, కార్పొరేట్ హంగులతో ఫినిషింగ్ ఇస్తున్నారు.

- 150 మంది వైద్య విద్యార్థులకు సరిపోయేలా 2 లెక్చర్ హాల్స్.
- కార్పొరేట్ లుక్‌తో జీ ప్లస్ టూ అంతస్తుల భవనం.
- సౌండ్‌ప్రూఫ్ విత్ డిజిటల్ పోడియంతో లెక్చర్ హాల్స్.
- విద్యార్థులకు 7 ప్రత్యేక టీచింగ్ గదులు.
- అత్యాధునిక అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్స్.
- మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్స్–2.
- సెంట్రల్ లైబ్రరీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్.
- హెచ్‌ఓడీలకు ఆధునిక సౌకర్యాలతో చాంబర్లు.
- ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ప్రత్యేక రూమ్స్.
- ప్రతి అంతస్తులో విద్యార్థులు, స్టాఫ్‌కు వేర్వేరుగా టాయిలెట్స్.
- రెండు వైపులా మెట్లతోపాటు లిఫ్ట్ సౌకర్యం.
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ చాంబర్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మిస్తున్నారు.

రూ.525 కోట్ల భారీ వ్యయంతో..

పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటుచేస్తామనే హామీని నిలబెట్టుకుంటూ సీఎం జగన్ 2019లో ఏలూరు జీజీహెచ్‌లో కాలేజీ పనులకు శంకుస్థాపన చేశారు. తొలి దశలో రూ.525 కోట్లతో నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. జీజీహెచ్ ప్రాంగణంలో ఆధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో 2 లక్షల చదరపు అడుగుల్లో జీప్లస్–4 భారీ ఆస్పత్రి, 2.5 లక్షల చదరపు అడుగుల్లో వైద్య కళాశాల శాశ్వత భవనం, వైద్య విద్యార్థులకు రెండు హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మాణం చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు.



అత్యాధునిక వసతులతో తరగతి గదులు

ప్రస్తుతం తాత్కాలికంగా ఏంసీహెచ్ బ్లాక్ పై అంతస్తులో హాస్టల్, డైనింగ్‌కు ఏర్పాట్లు చేశారు. రానున్న మూడేళ్లలో పూర్తిస్థాయిలో మెడికల్ కళాశాల ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది.

ఎన్‌ఎంసీ మార్గదర్శకాల మేరకు..



ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల మొదటి ఏడాది వైద్య విద్యార్థులకు వచ్చేనెల 1 నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాం. ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 150 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతులు ఉన్నాయి. అత్యాధునిక సౌకర్యాలతో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటుచేశారు. సౌకర్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కళాశాలలో చేరేలా ప్రోత్సహిస్తున్నాం. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ చేపట్టి విద్యార్థులను కేటాయిస్తుంది.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, ప్రిన్సిపల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఏలూరు

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు 3 వేల ల్యాప్‌టాప్‌లు

ఇన్‌చార్జి వీసీ విజయ్‌కుమార్



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

నూజివీడు: ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలవాలని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు, ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు కలిపి మూడు వేల ల్యాప్‌టాప్‌లను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. ల్యాప్‌టాప్‌లపై బోధన రాష్ట్రంలో ఏ ఇంజినీరింగ్ కళాశాలలో లేదన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీల్లో సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. మంచి లక్షణాలు ఉన్న ల్యాప్‌టాప్‌లను మంజూరు అందిస్తోందన్నారు. ఏవో ప్రదీప్, ఒంగోలు, శ్రీకాకుళం డైరెక్టర్లు జయరామిరెడ్డి, జగదీశ్వరరావు, అడ్మిషన్ల కన్వీనర్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, డీఎస్‌డబ్ల్యూఓలు ఎస్‌వీ వెంకట్రావు, వి.స్రవంతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన కమిటీ నియామకం



చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జిల్లా అధ్యక్షుడు

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన కమిటీని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. అధ్యక్షుడిగా ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉపాధ్యక్షులుగా వైట్ల కిషోర్ (ఆచంట), తానేటి జగ్జీవనరావు (తాడేపల్లిగూడెం)ను నియమించారు. వీరితోపాటు జనరల్ సెక్రటరీలుగా ఏడిద వెంకటేశ్వరరావు (ఉండి), విప్పర్తి ప్రశాంతి (పాలకొల్లు), దంపనబోయిన బాబూరావు (ఆచంట), తిరుమాని నాగరాజు (నరసాపురం), ట్రెజరర్‌గా కురిశేటి కాశీవిశ్వేశ్వరరావు (భీమవరం), సెక్రటరీలుగా దిద్దే శ్రీనివాస్ (ఆచంట), దింతకుర్తి లీలావతి (తాడేపల్లిగూడెం), శెట్టి శాంతకుమారి (తణుకు), సిరపు శ్రీనివాస్ (ఉండి), చవ్వాకుల సత్యనారాయణ (భీమవరం), కొండేటి రవీంద్ర ప్రసాదరావు (పాలకొల్లు), కొల్లాబత్తుల రవికుమార్ (నరసాపురం), కలిదిండి ఆనందరాజు (ఉండి) నియమితులయ్యారు.

ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా.. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా భీమవరం నియోజకవర్గానికి చెందిన చెల్లబోయిన వెంకట సత్యనారాయణ, నేతల జ్ఞానసుందరరాజు, రేవు పూర్ణ చంద్రరావు, పాలవెల్లి మంగ, ఉండి నియోజకవర్గానికి చెందిన మోరా జ్యోతి, బిరుదుగడ్డ గంగాధరరావు, బొచ్చు అచ్చారావు, పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన బోనం బులి వెంకన్న, రావి నాగేశ్వరరావు, కవురు సత్యనారాయణ, ఎడ్ల సత్యనారాయణ, నరసాపురం నియోజకవర్గానికి చెందిన ఓసూరి వీర విజయబాబు, పాలా రాంబాబు, కడలి రాంబాబు, ముస్కుడి రత్నం, తిరుమాని లక్ష్మి, ఆచంట నియోజకవర్గానికి చెందిన సత్తి వెంకటరెడ్డి, గొల్లపల్లి బాలకృష్ణ, దొండ దుర్గాప్రసాద్, సుంకర నాగబాబు, ఇందుకూరి ఉమాదేవి, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి సుధాకర్‌రెడ్డి, బొడ్డు సాయిబాబా, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, వాలనాటి సత్తిబాబు, తణుకు నియోజకవర్గానికి చెందిన వెలగల అమ్మిరెడ్డి, మారిశెట్టి శివశంకర్, చోడే జోషి, బొంత యశోదలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● స్వర్ణ చంద్రయాన్





చంద్రయాన్–3 విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఏలూరు జిల్లా గణపవరానికి చెందిన స్వర్ణకారుడు పేరూరి కృష్ణ కేవలం 700 మిల్లీగ్రాముల బంగారంతో చంద్రయాన్–3 విక్రమ్ రోవర్‌ను తయారు చేసి ఆకట్టుకున్నాడు. స్వర్ణ చంద్రయాన్‌ను ఆవిష్కరించి జాతికి అంకితమిచ్చాడు. – గణపవరం

భూ సర్వేతో వివాదాలకు చెక్

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



కె.బేతపూడిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వివాదాలు, తగాదాలు లేని గ్రామాలే లక్ష్యంగా దాదాపు వందేళ్ల తర్వాత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం పేరుతో ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, తొలిదశలో ఆధునిక పద్ధతిలో డ్రోన్, ఏరియల్ సర్వేలు పూర్తి చేసుకున్న గ్రామం కె.బేతపూడి అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కె.బేతపూడిలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేలో పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని కె.బేతపూడి, మొగల్తూరు మండలంలోని శేరేపాలెం గ్రామాలను ఎంపిక చేయగా కె.బేతపూడిలో సర్వే పూర్తిచేసి 582 మందికి రీ సర్వే పత్రాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో సింగిల్ బెడ్ ఆస్పత్రి, రైతు భరోసా కేంద్ర భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో సగటున ప్రతి ఇంటికీ రూ.1.25 లక్షలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం పలువురికి ఇంటి దస్తావేజులు, రేషన్ కార్డులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, దొంగ మురళీకృష్ణ, సర్పంచ్ బెల్లపు రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల తొలగింపుపై సమీక్ష

ఏలూరు(మెట్రో): నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు, విధి విధానాలు తెలియపరిచేందుకు గురువారం స్థానిక గిరిజన భవన్‌లో ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏలూరు డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన తహసీల్దార్లు, వీఆర్వోలు హాజరయ్యారు. 2003కు ముందు అసైన్డ్ ల్యాండ్ నిషేధిత భూములు జాబితా నుంచి తొలగించే ప్రక్రియ, ప్రతిపాదనలు, స్క్రూటినీ విధివిధానాలను వివరించారు. భూముల రికార్డులను పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సర్వే నంబర్, విస్తీర్ణం తెలియజేయాలన్నారు.

రీ సర్వేను వేగిరపర్చాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం, రీసర్వే ప్రక్రియ, ఇతర అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.జాషువాతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో 16 గ్రామాలు రీసర్వే ప్రక్రియ పూర్తి కాగా, ఆయా గ్రామాల్లో పాసు పుస్తకాలు పంపిణీ చేశారని, స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. రెండో దశలో 54 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను చేపట్టామన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో పలు పథకాల్లో 4,318 మంది అర్హులు
- రూ.5.33 కోట్ల నిధులు ఖాతాల్లో జమ
- 9,372 రైసు కార్డుల పంపిణీ



సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. అర్హులై ఉండి ఏ కారణంతో అయినా పథకాలు అందుకోలేని వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హతగల వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేసి గురువారం వారి ఖాతాల్లో నగదు జమ చేశారు.

జిల్లాలో 4,318 మంది..

గతేడాది డిసెంబర్ 22 నుంచి ఈ ఏడాది జూలై 2023 వరకు అమలు చేసిన సంక్షేమ పథకాల్లో అర్హత కలిగి వివిధ కారణాల వల్ల పథకాలు అందుకోలేని వారిని ప్రభుత్వం గుర్తించింది. ఇలా గుర్తించిన 4,318 మంది ఖాతాల్లో రూ.5.33 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.

నూతనంగా 9,372 రైసు కార్డులు

సంక్షేమ పథకాల్లో భాగంగా పేదలకు ప్రభుత్వం కొత్తగా 9,372 కార్డులు మంజూరు చేసి పంపిణీ చేసింది.

సచివాలయాల ద్వారా పారదర్శక సేవలు

నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా జిల్లాలో 4,318 మంది లబ్ధిదారులకు రూ.5.33 కోట్ల మేర లబ్ధి చేకూరినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తాడేపల్లి నుంచి సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి అర్హుల ఖాతాల్లో నగదు జమచేయగా భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో సంతృప్తికర స్థాయిలో పథకాలు అందిస్తోందన్నారు.

అర్హత కలిగి ఉండి ఏదైనా కారణంతో పథకం నిలిచిపోతే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, సాంఘిక సంక్షేమ అధికారి శోభారాణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి రూ.లక్షల్లో
జగనన్న అమ్మఒడి	551	71.63
వైస్సార్ నేతన్న నేస్తం	6	1.44
వైఎస్సార్ రైతు భరోసా	574	39.01
ఈబీసీ నేస్తం	264	39.60
జగనన్న తోడు	1,028	154.20
జగనన్న వసతి దీవెన	813	71.17
జగనన్న విద్యా దీవెన	1,082	156.26

నేతన్న నేస్తం అందింది



నాకు నేతన్న నేస్తం పథకం కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. దీనిపై నేను దరఖాస్తు చేసుకున్నా. వెంటనే అధికారులు స్పందించి నాకు మూడో విడత నేతన్న నేస్తం సాయం అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– పడమటి కోట వెంకటేశ్వరరావు, దిగమర్రు

చేయూత మంజూరైంది



నాకు మూడో విడత వైఎస్సార్ చేయూత పథకం అందలేదు. దీంతో నేను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్నా. నాకు ప్రభుత్వం తిరిగి చేయూత ఆర్థిక సాయాన్ని మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– యు.రాజమణి, భీమవరం

అమ్మఒడి వచ్చింది



సాంకేతిక సమస్యతో నాకు ఈ ఏడాది అమ్మఒడి పథకం అందలేదు. దీంతో నేను మరలా దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం మంజూరు చేసింది. అర్హత కలిగిన వారికి తిరిగి సంక్షేమ పథకాలు అందించడం చాలా బాగుంది.

– ఎస్‌కే నజరానా, భీమవరం 11 వార్డు

ఓట్ల తొలగింపుపై పునః పరిశీలన

భీమవరం(ప్రకాశం చౌక్): ఓట్ల తొలగింపులో పారదర్శకతతో కూడిన పరిశీలన అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో తొలగించిన ఓట్లు పునః పరిశీలనపై ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 జనవరి 6 నుంచి ఇప్పటి వరకూ తొలగించిన ప్రతి ఓటునూ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. బీఎల్‌ఓలు తనిఖీ చేసిన ఫైల్స్‌ను పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియను నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి తొలగింపునకు స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ పాటించారా లేదా అనేది తనిఖీ చేయాలన్నారు. ప్రతిఒక్క ఓటరుకు సంబంధించి తీసుకున్న చర్యల రికార్డులు, జారీ చేసిన నోటీసులు, దానికి సంబంధించిన జవాబుల ఫైలును ఈఆర్వో నెట్ నందు అప్‌లోడ్ చేయాలన్నారు. ఏమైనా పొరపాటుగా ఓటు తొలగింపు జరిగిన విషయంలో సదరు వ్యక్తి అప్పీలు, క్లయిమ్ దాఖలు పరచవచ్చు అనే విషయమై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఓటరు జాబితా నుంచి ఓట్ల తొలగింపునకు గల కారణాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. బహుళ ఫొటో సారూప్య ఎంట్రీలు కలిగి ఉండటం, ఓటరు వివరాలు రిలేషన్ పేరు, రిలేషన్ టైపు, వయసు, లింగం, చిరునామా ఒకే విధముగా లేకపోవడం, ఒకటి లేక రెండు ఎంట్రీలు తేడాగా ఉండటం, ఓటరు తన చిరునామా ఇంటి నందు నివసించకపోవడం, మరణించిన ఓటర్లు, శాశ్వతంగా బదిలీ అయిన ఓటరు వివరాలు తొలగిస్తారన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హనుమాన్ జంక్షన్ రూరల్: నూజివీడు రైల్వే గేటు సమీపంలో రామిలేరు రైల్వే బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఏలూరు రైల్వే పోలీసులు గురువారం గుర్తించారు. రైలు ప్రమాదానికి గురై దుర్మరణం చెందినట్లుగా భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా పురుగులు పట్టి, అస్తి పంజరంగా మారి గుర్తు పట్ట లేనిస్థితిలో ఉందని ఏలూరు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉంటాడని, కాషాయ రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. గుర్తు తెలియని రైలు ఢీకొనటం, లేదా రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిపోవటం వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించి ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సిద్ధమైన జన్మభూమి పార్కు-2 ముఖద్వారం


ఆకర్షణీయమైన రంగులతో జన్మభూమి పార్కు-1 ముఖద్వారం




పార్కులో ఆసక్తికరంగా తీర్చిదిద్దిన కౌబాయ్ బొమ్మ

పార్కులకు కొత్త సొబగులు

నగరంలోని పార్కులు సుందరంగా ముస్తాబవుతున్నాయి. నగరవాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా నగరపాలక సంస్థ అధికారులు వీటిని సిద్ధం చేస్తున్నారు. కొత్తబస్టాండ్ సమీపంలో తమ్మిలేరు కాలువను ఆనుకుని ఏర్పాటు చేసిన జన్మభూమి పార్కు ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ పార్కును కొత్త రంగులు, చిత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. త్వరలో ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి రానుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు


పెయింట్ వేస్తున్న సిబ్బంది


చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

భవిష్యత్‌లో కృత్రిమ మేధదే ప్రధాన పాత్ర

ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో గురువారం »ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఇన్ ఎడ్యుకేషన్« అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేసీ రెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలమంతా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ముఖ్యభూమిక పోషించనుందని, ఇప్పటి నుంచే విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రజల దైనందిన జీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపుతుందన్నారు. విద్య నుంచి నిర్మాణం, క్రీడలు తదితర అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు ద్వారా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రతినిధి కౌశల్ కుమార్ భగత్ వర్క్‌షాప్‌లో ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), 360 వర్చువల్ రియాలిటీ, ఇంటరాక్టివ్ కంటెంట్ డిజైన్, కాపీ రైట్, ఓపెన్ సోర్స్ వంటి ఏఐ సాధనాలను వివరించారు. అంతేగాకుండా అకడమిక్ ఆర్టికల్ రీడింగ్, రైటింగ్, ప్లగియారిజం, పబ్లికేషన్ ఎథిక్స్ సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, డీన్ అకడమిక్స్ లక్ష్మణరావు, ఏపీ పీ ప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.


నూజివీడు ట్రిపుల్‌ఐటీ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నేటి నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు

- ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం..
- వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా ఏలూరు పోలీస్ గ్రౌండ్స్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు
- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెండో దశ దేహదారుఢ్య పరీక్షలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఈ పరీక్షలు ప్రారంభించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అభ్యర్థులకు ఫిజికల్ మేనేజ్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ) నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని 9,689 మంది అభ్యర్థులకు దశలవారీగా పరీక్షలు నిర్వహించి, ఎంపికలు చేస్తారు.

దేహదారుఢ్య పరీక్షలకు రంగం సిద్ధం

ఏలూరు రేంజ్ పరిధిలోని ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభిస్తారు. ఏలూరు రేంజ్‌లో 8,247 మంది పురుష అభ్యర్థులు, 1,442 మహిళా అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సెప్టెంబర్ 9 తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. అభ్యర్థులకు తొలుత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ కాపీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పోలీస్ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.


ఎంపిక పరీక్ష విధులపై అధికారులకు సూచనలిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

డీఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో..

పోలీస్ సెలెక్షన్స్ నేపథ్యంలో ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్నారు. వర్షం కురిసినా ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలతో భారీఎత్తున పోలీస్ అధికారులు ఎంపిక పరీక్షలు సజావుగా సాగేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎంపిక పరీక్షలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, డీఎస్పీ విజయ్‌పాల్, ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు డీఐజీ కార్యాలయ మేనేజర్ నాగరాజు, పీఏ సాయిరాం, కార్యాలయ సిబ్బంది సతీష్, రత్నానంద్, శ్రీనివాస రెడ్డి, సీఐ బీ.ఆదిప్రసాద్, సీఐ రాంబాబు, ఎసైస రిజ్వాన్, ఆర్ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, నాగేంద్ర, వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): వివిధ సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. నగరంలోని నరసింహారావుపేటలో సాగ్ ట్రైనింగ్ అకాడమీలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన యువతీ, యువకులకు జెడ్పీ చైర్‌పర్సన్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగి ఉపాధి కొరకు ఎదురు చూస్తున్న యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సాగ్ ట్రైనింగ్ అకాడమీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సాగ్ కార్యదర్శి కాట్రు బాలు మాట్లాడుతూ గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా 600 మంది హాజరుకాగా, వీరిలో 252 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఈ మేళాలో టెక్ మహీంద్ర, కాప్‌జెమిని, జెన్ ఫాక్ట్, హెటీరో డ్రగ్స్, అరబిందో ఫార్మసీ, హెచ్‌డీఎఫ్‌సీ, టెక్ విష్, వెట్రో సాఫ్ట్ సొల్యూషన్స్ వంటి 20కి పైగా కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


యువతికి నియామక పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

గడపగడపకు సంక్షేమం

ఆకివీడు : ఆకివీడు 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు




కొల్లేరువాసుల సమస్యలపై సానుకూలంగా సీఎం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు ప్రజల సమస్యలపై సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో అదనంగా ధ్వంసం చేసిన 7,500 ఎకరాల భూములను తిరిగి పంపిణీ చేయాలని కోరుతూ తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయంలో కార్యదర్శులకు గురువారం ఆయన వినతి పత్రం అందించారు. అనంతరం కైకలూరు వచ్చిన ఎమ్మెల్సీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు, ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లంలకు కొల్లేరు ప్రాంతంలో భూముల పంపిణీ అంశాన్ని వివరించానన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో జీవో నంబర్ 120లో సూచించని అదనపు చేపల చెరువులను ధ్వంసం చేశారని అనాటి పరిస్థితులను చెప్పానన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలోనే కొల్లేరులో డ్రోన్ సర్వే పూర్తయిన తర్వాత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


తాడేపల్లి సీఎం కార్యాలయంలో అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబు




కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది, ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు →

ద్వారకాతిరుమల : వరలక్ష్మి వ్రత వేడుకలకు క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రెండవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని గురువారం దేవస్థానం సిబ్బంది మామిడి తోరణాలు, అరటి బోదెలు, వేప ఆకులతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే అమ్మవారిని శాకాంబరిగా అలంకరించేందుకు ఫల, కూరగాయలను సిద్ధం చేశారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారు ఫల, కూరగాయల అలంకరణలో శాకాంబరిగా దర్శనమిస్తారని, పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.

ఉరి వేసుకుని కాపలాదారుడు ఆత్మహత్య

మండవల్లి: చేపల చెరువు వద్ద కాపలా ఉంటున్న ఓ వ్యక్తి గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కైకలూరు మండలం శ్యామలాంబపురం గ్రామానికి చెందిన బచ్చు నరేష్ (30) లోకుమూడి గ్రామానికి చెందిన గుత్తికొండ రాధాకృష్ణ చెరువుపై కాపలాగా ఉంటున్నాడు. గురువారం ఉదయం రాధాకృష్ణ చెరువు వద్ద ఉన్న షెడ్ దగ్గరకు వచ్చేటప్పటికి నరేష్ దూలానికి ఉరి వేసుకుని చనిపోయి వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై టి.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సోదరుడు బచ్చు రాజేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ


ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: కొట్టి గాయపర్చిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన వారా నాగేంద్ర ఇల్లు నిర్మించుకుంటున్నాడు. సమీపంలోని సాయి, మరో ఇద్దరు నాగేంద్ర ఇంటి వద్ద మట్టిని తరలిస్తుండగా, నాగేంద్ర, అతని భార్య నిలదీశారు. దీంతో వారు దాడి చేయడంతో నాగేంద్ర, భార్యకు గాయాలయ్యాయి.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

నరసాపురం రూరల్: గంజాయి కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ సురేష్‌బాబు చెప్పారు. డీఎస్పీ చారి ఆదేశాల మేరకు గతంలో మొగల్తూరులో నమోదైన గంజాయి కేసులో సిదేరి రాము అనే యువకుడు నిందితుడిగా ఉన్నాడన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న అతనిని అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని మంప పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతవరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. చింతపల్లిలోని ఓ కళాశాలలో యువకుడు చదువుతున్నాడన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఫణీంద్ర

తణుకు: తణుకు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన కట్టా ఫణీంద్ర (30) మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. బీటెక్ పూర్తి చేసినా ఫణీంద్రకు సరైన ఉద్యోగం లేకపోగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కొన్నాళ్లు మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ప్రేమించిన అమ్మాయి సైతం పెళ్లి చేసుకోనని చెప్పడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఫణీంద్ర తిరిగి రాలేదు. గురువారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్టేషన్ మాస్టర్ కె.చిరంజీవి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పీఎస్ఆర్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు, విద్యుత్ స్తంభం

పెంటపాడు: కొండేపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు కొండేపాడు-మీనవిల్లూరు రోడ్డులో సిమెంట్ విద్యుత్ స్తంభంతో పాటు, భారీ చెట్టు రోడ్డుపై కూలాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖ కార్యాలయానికి సమాచారాన్ని అందించగా గురువారం మధ్యాహ్నం నాటికి రోడ్డుకు అడ్డంగా ఉన్న వీటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. దేవరశెట్టి రాంబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 2 లక్షల విరాళం


దాత సత్యకుమార్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు గురువారం రూ. 2,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లి గూడెంకు చెందిన బాయిశెట్టి సత్యకుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని సమాచార కేంద్రంలో ఈ విరాళాన్ని జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ మిట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు


శంకరమఠానికి కానుకలు సమర్పణ చేస్తున్న డాక్టర్ చిట్యాల సురేంద్రకుమార్

తాడేపల్లిగూడెం: స్థానిక శంకరమఠంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి, సర్వమంగళ అమ్మవారి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వైద్యులు చిట్యాల సురేంద్రకుమార్, పద్మిని దంపతులు రజతపాత్ర, దీపారాధన కుందులు గురువారం దేవస్థానానికి సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఓగేటి పండు, ఆదూరి కృష్ణమోహనశర్మ, ధూళిపాళ ఆదిత్య పాల్గొన్నారు.

పేదల కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్ సీపీ


మాట్లాడుతున్న వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకారం

వీరవాసరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని రాయకుదురులో గురువారం జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యాన అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపు అడుగులు వేస్తూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని వివరించారు. గృహసారధుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ గెడ్డం భారతి, నాయకులు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని రెస్ట్ హౌస్ రోడ్డు శివారులో వెలసిన శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాలర్ల సంఘం సొసైటీ ఆధ్వర్యాన అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు.

అంతర పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉండి: వ్యవసాయం, అరటి సాగులో అంతర పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తే అధిక లాభాలు సాధించవచ్చని డాక్టర్ ఎన్ భరతలక్ష్మీ అన్నారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కేవీకేలో విత్తనోత్పత్తి క్షేత్రం, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పదర్శనాక్షేత్రం, ఉద్యానవన షేడ్‌నెట్ నర్సరీ, కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ రకాల అరటి మొక్కల ప్రదర్శనాక్షేత్రాన్ని, వరిసాగును ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు లాభాలు రావాలని, మంచి విత్తనాలు వారికి అందించాలని కేవీకేల ద్వారా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తణుకు నియోజకవర్గ సంక్షేమం, అభివృద్ధికి రూ. 2460.57 కోట్లు
- నాలుగేళ్లలో నాలుగు దశాబ్దాల అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- ఆకర్షణగా ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు
- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానంటున్న మంత్రి కారుమూరి



తణుకు మునిసిపాలిటీ భవనం

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను సృష్టించి పారదర్శకంగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. జగనన్న కాలనీలు పేరుతో అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేస్తున్న తీరును ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు. రాష్ట్రంలో సంక్షేమం లేదు, అభివృద్ధి లేదని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలకు చెంప చెల్లుమనేట్లుగా గత నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గానికి ఎంత అభివృద్ధి జరిగింది, ప్రజలకు ఎంతమేర సంక్షేమం అందిందనేది తణుకు ప్రధాన కూడళ్లలో వివరంగా పార్టీ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

సంక్షేమం, అభివృద్ధి ఇలా...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి నాలుగేళ్ల జగనన్న ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమానికిగాను రూ.2460.57 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో భాగంగా 19, 145 పనులకుగాను రూ. 827 కోట్లు, సంక్షేమ పథకాల రూపంలో 2,68, 089 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ. 1,633 కోట్లు జమచేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సంబంధించి అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యావ్యవస్థకు అండగా నిలబడగా, కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు లబ్ధిదారులకు ఆర్థికంగా అండగా నిలబడ్డాయి. అభివృద్ధిలో భాగంగా రహదారుల నిర్మాణాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకే సెంటర్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, జలజీవన్ మిషన్ తాగునీరు, నాడు నేడు పాఠశాల భవనాలు వంటి నిర్మాణాలు జరిగాయి.

జగనన్న సంక్షేమం ఒక చరిత్ర



“దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోను అమలులేని సంక్షేమం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. తణుకు నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధి కోసం ఇప్పటివరకు రూ.2,460.57 కోట్లు నిధులు ఖర్చు చేసింది. జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమానికి ఖర్చు చేస్తున్న నిధులు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఏం చేశారో ప్రజలకు అర్థమవుతోంది. భవిష్యత్తులో తణుకు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా పాలన అందిస్తాను.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

సంక్షేమంతో పేదరికం తగ్గుతుంది



జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రతి గడపలోను విరాజిల్లుతున్నాయి. ఏపీలో అందుతున్న సంక్షేమ ఫలాల కారణంగా పేదరికం కూడా గణనీయంగా తగ్గుముఖం పడుతుంది. ఒక కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తేదేశ ఆర్థిక స్థితులు మెరుగుపడతాయనే ఉద్దేశ్యంతో జగనన్న పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నారు.

– యిందుగపల్లి బలరామకృష్ణ, జేసీఎస్ పట్టణ కన్వీనర్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



పేదవర్గాలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన అనంతరం నా భర్తకు దివ్యాంగ పింఛన్ వస్తుంది. నాకు కాపు నేస్తం ద్వారా రూ.15వేలు, ఇంటి స్థలం కూడా ఇచ్చారు. డ్వాక్రా రుణ మాఫీ, సున్నా వడ్డీ కూడా నాకు గత నాలుగేళ్లుగా అందుతుంది. మా ఇంటిల్లిపాది ఎప్పటికి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము.

– నూకల రమాదేవి, తణుకు

ఆత్మీయ కలయిక


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం గురువారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అప్సడా వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి 18 నెలలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కాలంలో ఆక్వా రంగంలో ప్రభుత్వం తరపున అప్సడా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల గురించి సీఎంకు వివరించానని రఘురాం చెప్పారు. రొయ్య ధరల స్థిరీకరణ, మేత ధరలు పెరగకుండా నియంత్రించడం, ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు రాయితీపై విద్యుత్ అందించడం తదితర విషయాలపై వివరించానన్నారు. ఆక్వా రైతులు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారని, ఆ మేరకు చర్యలు తీసుకుంటానని రఘురాం తెలిపారు. గత ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్న ఆక్వా రంగంలో అన్ని సమస్యలను చక్కదిద్దిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన అప్సడాకే దక్కిందన్నారు.

కోలాహలంగా ‘గూడెం’


తాడేపల్లిగూడెం పట్టణం కే ఎన్ రోడ్డులో పువ్వుల దుకాణాల వద్ద మహిళలు


గూడెంలో కొనుగోలు దారులతో కిక్కిరిసిన మార్కెట్

తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు: శ్రావణ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని గురువారం తాడేపల్లిగూడెం పట్టణం మహిళలతో కోలాహలంగా మారింది. రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పూజా సామాగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో రహదారులు కిక్కిరిశాయి. వినాయక చవితిని తలపించే విధంగా రహదారులు పత్రి, పువ్వులు, పండ్ల దుకాణాలతో నిండిపోయాయి. పత్రి రూ.20లు, కలువ పువ్వులు మూడు రూ.10లు, తామర పువ్వులు నాలుగు రూ.50లు, చామంతి పువ్వులు పావు కిలో రూ.150లు, అరటి ఆకులు ఐదు రూ.10లు,

కిక్కిరిసిన జ్యూయలరీ, వస్త్ర దుకాణాలు

కొబ్బరికాయలు ఐదు రూ.100లు ధరలు పలికాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ధరలు ఏ మాత్రం తగ్గలేదని కొనుగోలుదారులు పేర్కొంటున్నారు. మరో పక్క జ్యూయలరీ, వస్త్ర దుకాణాలు సైతం కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. ప్రతీ ఏటా శ్రావణ మాసం రెండవ శుక్రవారం రోజున నూతన వధువు, ముత్తయిదువలు రూపును ధరించడం పరిపాటిగా వస్తోంది. దీంతో ఈ రూపును, వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆయా దుకాణాల వద్ద కిక్కిరిసి కనిపించారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం మార్కెట్ తర్వాత తాడేపల్లిగూడెం జ్యూయలరీ మార్కెట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. తాడేపల్లిగూడెం పరిసర 70 నుంచి 80 గ్రామాల ప్రజలు ఇక్కడకు వచ్చి బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తుంటారు. దీంతో శ్రావణమాసం, ధనత్రయోదశి వంటి పండుగ రోజుల్లో ఇసుక వేస్తే రాలనంతగా కొనుగోలు కనిపిస్తుంటారు. ప్రధానంగా శేషమహల్ రోడ్డు ఆయా రోజుల్లో ఖాళీ ఉండే పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే ఈ శ్రావణ మాసం గురువారం శేషమహల్ రహదారి కొనుగోలుదారులతో కిక్కిరిసి కనిపించింది.

రోగులకు మెరుగైన సేవలందించాలి


తాడేపల్లిగూడెం మండలం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించాలని ఎంపీపీ పానుకుమాటి శేషులత అన్నారు. గురువారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి, సలహా సంఘ సమావేశం పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శేషులత మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలను తెలియజేస్తే వాటి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నాణ్యమైన సేవల ద్వారా పీహెచ్‌సీకి మంచి పేరు తేవాలన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లోని పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. అడపా దడపా వర్షాలు పడుతుండటంతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్ ముప్పిడి సూర్య కుమారి, వైద్యురాలు సింధూ, ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణకిషోర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బల్లిపాడులో చంద్రయాన్-3 విజయోత్సాహం

అత్తిలి: భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అవిరళ కృషి, పట్టుదల, సాధించాలనే తపన ఫలితమే నేడు ప్రపంచం మనవైపు అబ్బురంగా చూస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్ సీఎం దత్ చెప్పారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజయోత్సవ వేడుక, శాస్త్రవేత్తలకు అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు ×జయహో ఇస్రో అనే అక్షర ఆకారంలో కూర్చుని శాస్త్రవేత్తలకు అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ మేరా భారత్ మహాన్ అని అందరూ గర్వంగా తలెత్తుకుని నడవాల్సిన సందర్భం ఇది అని, అంతరిక్ష శాస్త్రవేత్తల కృషిని, ఇస్రో విజయాన్ని మనందరం పండుగలా జరుపుకోవాలన్నారు. విద్యార్థులు ఇటువంటి విజయాలను స్ఫూర్తిగా తీసుకుని బాగా చదివి శాస్త్రవేత్తలుగా తయారయ్యి, దేశానికి ఉపయోగపడి, దేశ సేవ చేయాలని కోరారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, బాలసుబ్రహ్మణ్యం, సుజాత, శ్రీకాంత్, రాంబాబు, లలిత, నాగేశ్వరరావు, మాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్రో చైర్మన్‌కు భారతరత్న ఇవ్వాలి

తాడేపల్లిగూడెం: చంద్రయాన్ -03ని విజయవంతం చేసిన ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు భారతరత్న ఇవ్వాలని ఏపీస్టేట్ కన్స్యూమర్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఏఆర్‌కె.హనుమంతరావు కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి లేఖలు రాశానన్నారు. ఇస్రో ఉద్యోగులకు కూడా బహుమతిగా రెండు నెలల వేతనం గౌరవపూర్వకంగా ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.

చలో గాజువాకను విజయవంతం చేయాలి


తణుకులో చలో గాజువాక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేనేత కులాల నాయకులు

తణుకు టౌన్: ఈనెల 27వ తేదీన విశాఖపట్టణంలో చేనేత కులాల జాతీయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చలో గాజువాక పేరుతో నిర్వహించే చేనేతల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని జాతీయ చేనేత కులాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమతం రమణ మహేష్ చెప్పారు. గురువారం తణుకులోని చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి నివాసంలో జరిగిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ చేనేత కుటుంబంలో ఉన్న 18 కులాలకు చెందిన ప్రతినిధులు జాతీయ స్థాయిలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈనెల 27వ తేదీన గాజువాకలోని బీసీ రోడ్డులో గల టీఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఈసమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన చేనేత కులాలకు చెందిన నాయకులు పాల్గొవాలని కోరారు.

చంద్రయాన్ 3 విజయం పట్ల హర్షం...

ఇస్రో శాస్త్రవేత్తలు నిర్వహించిన చంద్రయాన్ 3 విజయవంతం కావడం పట్ల చేనేత కులాలకు చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం తణుకులోని బొమ్మల వీధిలో గల సరళాదేవి నివాసంలో చేనేత కులాలకు చెందిన నాయకులతో కేక్ కట్ చేశారు. చేనేత సంఘాల నాయకులు ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి దుర్గ రమేష్, కరెళ్ల శ్రీనివాసు, వేల్పూరు గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ ఐశెట్టి సరస్వతి, కరికాల భక్తుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందే నాగయ్య, విశ్వనాథం పరదేశీ, సత్తిబాబు, హేమంత్, సంగడి సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాలకొల్లు అర్బన్: దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు కోరారు. దేశ భవిష్యత్తు ఓటు అనే ఆయుధంపై ఆధాపడుతుందని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని ఉల్లంపర్రు డాక్టర్ సబితా జూనియర్ కళాశాలలో గురువారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించినట్లు చెప్పారు. ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు రూ. 10 వేలు విరాళం

తణుకు టౌన్: తణుకు బ్యాంక్ కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వృద్ధులకు అందిస్తున్న సేవా కార్యక్రమాల నిర్వహణకు తణుకు పట్టణానికి చెందిన ఆలపాటి మాధవి రూ. 10 వేలు విరాళం అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. గురువారం అసోసియేషన్ కార్యాలయం వద్ద విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవిని అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, కార్యదర్శి కేవీ సత్యనారాయణ కోశాధికారి ఆర్జి భాస్కరరావు తదితరులు అభినందించారు.

అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కసరత్తు


ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. వంతెనలకు ఇరువైపులా అక్రమణలు పెరిగిపోవడంతో డిజైన్ల ఖరారు విషయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, కన్సల్టెంట్ రామకృష్ణ సమావేశమై డిజైన్ల ఖరారుపై చర్చించారు. ఇదిలా ఉంటే ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ముందుగా రూ.15.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అయితే మరింత ఆధునిక డిజైన్లతో అప్రోచ్ రోడ్లను నిర్మించాలనే తలంపుతో ఎమ్మెల్యే శ్రీనివాస్ రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించారు. కానీ కన్సల్టెంట్ జాప్యంతో కొంతమేర అప్రోచ్ రోడ్ల నిర్మాణం ఆలస్యమైంది. అయితే ఎమ్మెల్యే గ్రంధి పట్టువదలకుండా డిజైన్ల ఖరారు కోసం శ్రమించడంతో ఇటీవలే ఆర్‌అండ్‌బీ సీఈ (డీఎం) ఎల్. శ్రీనివాస్ రెడ్డి స్వయంగా వంతెనలను పరిశీలించారు. వంతెనలకు ఇరువైపులా ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో డిజైన్ల కసరత్తును పూర్తి చేయడానికి స్థానికంగా ఉన్న ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈ, కన్సల్టెంట్ వినతి మేరకు మరోసారి ఎస్ఈ రెండు రోజుల పాటు వంతెనలను పరిశీలించనున్నారు. కాగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేసిన కృషి కారణంగా నాలుగైదు రోజుల్లోగా డిజైన్లు ఖరారు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే నిధులు మంజూరు అయ్యాయి కాబట్టి డిజైన్లు ఖరారైన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారని అధికారులు చెప్తున్నారు.

ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవర (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటన తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించటానికి 8 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు పశ్చిమగోదావరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27 ఆఖరు తేదీగా పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెమ్యూనరేషన్‌గా నెలకు రూ.18,500 చెల్లించనున్నట్లు తెలిపారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, అభ్యర్థి వయస్సు 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కాళ్ల: గ్రామంలోని ప్రజలకు సేవలు అందించడంతోపాటు నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీయల్ నరసింహారాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమీరం గ్రామసర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు ఏర్పాటు చేసిన దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని సుమారు 600 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన పీవీఎల్ మాట్లాడుతూ సర్పంచ్ సోమేశ్వరరావు తన మనవడు కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోరా రామ్మూర్తి, పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డు గాంధీ నగర్(లెప్రసీ కాలనీ)లో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడు పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక పక్క ఆరోగ్యశ్రీ పథకాన్ని అద్భుతంగా అమలు చేస్తూనే మరోపక్క వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. అందులో భాగంగానే ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికీకరించటంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం, వాటికి శాశ్వత భవనాలను కూడా నిర్మిస్తున్నారన్నారు. అందులో భాగంగా భీమవరం పట్టణానికి మూడు అర్బన్ పీహెచ్‌సీలను మంజూరు చేసి వాటికి భవనాలు కూడా నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈఓ, ఎల్‌జీఎస్, 8 మంది ఏఎన్‌ఎంలు, 9 మంది ఆశా వర్కర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డీపీఎంవో డాక్టర్ సుగుణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.